క్లుప్తంగా

రేపు ఉగాది పంచాంగ శ్రవణం



తెనాలి: బ్రాహ్మణ పరిషత్ తెనాలి ఆధ్వర్యంలో ఈ నెల 9న సాయంత్రం 5.30 గంటల నుంచి స్థానిక జూనియర్ కాలేజీ ఆవరణలో ఉగాది పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్టు పరిషత్ కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ తెలియజేశారు. జ్యోతిష్య పండితుడు బ్రహ్మశ్రీ జీవీఎల్ఎన్ చార్యులు హాజరైన వారి సందేహాలు, సమస్యలకు పరిష్కారం చెబుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, లక్కరాజు లక్ష్మణరావు, బుద్ధు వెంకటేశ్వర్లు, చెన్నాప్రగడ శ్రీనివాస్, కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

14న పవన్ కల్యాణ్ తెనాలి రాక



తెనాలి: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఈనెల 14న తెనాలి రానున్నారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు స్థానిక మార్కెట్ సెంటర్లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 3న జరగాల్సిన పవన్‌కల్యాణ్ పర్యటన రద్దయ్యిందని ఆయన జ్వరం నుంచి కోలుకుని తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ఈనెల 14న పవన్‌కల్యాణ్ తెనాలి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు తోటకూర వెంకటరమణారావు, బండారు రవికాంత్, హరిదాసు గౌరీశంకర్, ఇస్మాయిల్ బేగ్, నన్నపనేని రాంబాబు, గ్యాలం వేణు ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు




మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేలా కృషి చేయాలని పలువురు ప్రతినిధులు కోరారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గాలకు రెండు రోజుల పాటు నగర పరిధిలోని చినకాకాని హాయ్‌ల్యాండ్‌లో నిర్వహించిన అభ్యసన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా హాజరైన ప్రతినిధులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, సేవా కార్యక్రమాలను ఎలా విస్తృతం చేయాలనే అంశాలపై వివరించారు. ప్రతినిధులు శరత్ చౌదరి, బీపీ రాజు, అన్నే రత్నప్రభాకర్, అందే రేవంత్, గాజుల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, అందే మురళి, నిరంజన్ గుప్తా, కేవీఎస్ ప్రకాశరావు, కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాంచారమ్మ చెరువు వద్ద నుంచి ప్రచారం

మంగళగిరి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య సోమవారం పట్టణంలోని దామర్ల నాంచారమ్మ చెరువు వద్ద నుంచి ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆదివారం తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు పాల్గొంటారని నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో లైలతుల్ ఖదర్



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, మంగళగిరి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలాల్లో లైలతుల్ ఖదర్ (బడీ రాత్) వేడుకలను ముస్లింలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బడీరాత్ సందర్భంగా మసీదుల్లో ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.. ముస్లింలు రాత్రంతా అల్లాను స్మరిస్తూ ధ్యానించారు. పలు మసీదుల్లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. రంజాన్ మాసంలో ముస్లింలు తాము దాచుకున్న దాంట్లో పేదలను ఆదుకోవాలని అప్పుడే అల్లా కరుణిస్తాడని, ప్రతి ముస్లిం తప్పనిసరిగా సేవా భావం చాటాలని ఇమామ్‌లు తెలియజేశారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వారి అభ్యున్నతి కోసమే సంక్షేమ పథకాల అమలు
- కోవిడ్ సమయంలోనూ ప్రజా సేవను విస్మరించలేదు
- నాడు కానరాని ప్రతిపక్ష అభ్యర్థి నాదెండ్ల మనోహర్ నేడు ఓట్ల కోసం ఉన్నత వర్గాలతో భేటీ
- తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ గిరిజన యానాదుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్
- 'అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా ఉంటా'



గిరిజన యానాదుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సమాజంలో వెనుకబడిన కులాలను అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. తెనాలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ గిరిజన యానాదుల ఆత్మీయ సమావేశం ఆదివారం స్థానిక చెంచుపేటలోని రావి రంగమ్మ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీతో పాటు పైసా అవినీతి లేకుండా అనేక సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటున్నట్టు గుర్తుచేశారు. విలువైన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్లు చేసి మరీ పేదలకు ఇచ్చామన్నారు. తాను అణగారిన వర్గాలు, కింది కులాలతో ఆత్మీయంగా సమావేశమవుతుంటే ప్రతిపక్ష అభ్యర్థి ఉన్నత వర్గాలతో భేటీ అవుతున్నారని గుర్తు చేశారు.

గత అయిదేళ్లలో రెండేళ్లు కరోనా విపత్కర పరిస్థితులున్నాయని చెబుతూ పేదలకు నిత్యావసరాలు, కూరగాయలు, ఆహారం అందించటం, బాధితులకు వైద్య సహాయం అందేలా తాను కృషి చేసినట్టు ఫొటోలతో సహ ప్రదర్శించారు. పదేళ్లు ఇక్కడ ఎమ్మెల్యేగా చేసి ఇప్పుడు ప్రతిపక్ష పార్టీ తరఫున పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్ అప్పుడు హైదరాబాద్‌లో దాక్కున్నారని విమర్శించారు. ఒక్క రోజైనా వచ్చి బాధితులను పరామర్శించారా? అంటూ శివకుమార్ ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా గత అయిదేళ్లలో ఒక్కరోజైనా టిడ్కో ఇళ్ల పరిస్థితిని గమనించని మనోహర్ ఇప్పుడు ఎన్నారై ఎంపీ అభ్యర్థితో సహా అక్కడకు వెళ్లి విమర్శలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. తాను ఎన్నోసార్లు మీ కాలనీకి వచ్చానంటూ శివకుమార్ గుర్తుచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి యందేటి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ గుండా సురేంద్ర, జోనల్ ఇన్‌చార్జి మానుపాటి చిరంజీవి, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి చౌటూరి రమేష్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు మేడ వెంకటేశ్వర్లు, యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొమరగిరి సూరిబాబు, పొట్లూరి అశోక్, తుమ్మల రమేష్, నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడారు.

'అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా ఉంటా'

తెనాలి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కాదు శాసన సభ్యుడిగా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎనీటైమ్ ఎమ్మెల్యేను తానేనని స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా, అవసరమొచ్చినా తనను ఏ టైములో నైనా సంప్రదించే అవకాశం ఉందని గుర్తు చేశారు. అయిదేళ్లూ కనిపించని ప్రతిపక్ష నేతలు, ఎన్నికల ముందు మకాం మార్చి కుల మతాలు, పార్టీల పేరుతో ఓట్ల కోసం మార్కెటింగ్ చేస్తున్న అభ్యర్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘీయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని శశి వేదికలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆర్య వైశ్యులకు అండగా ఉండి వారికి తనవంతు సహకారాన్ని అందించానన్నారు. మినహా వ్యాపారుల దగ్గర ఏనాడూ చందాలు అడగలేదన్నారు. తోపుడు బండ్లు, పూల వ్యాపారులు, ఆటో స్టాండ్ల వద్ద ఏనాడైనా తన హయాంలో అక్రమ వసూళ్లకు పాల్పడ్డామన్న అభియోగాలు నిజమేనని భావిస్తే తమకు ఓటు వేయవద్దని సూచించారు.

నియోజకవర్గంలో రూ.1800 కోట్ల సంక్షేమాన్ని, 27 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను ఇచ్చినట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తు చేశారు. పట్టణంలోని ఆర్యవైశ్యులు వెయ్యి మందికి ఇళ్ల స్థలాలను ఇచ్చినట్టు తెలిపారు. ఈబీసీ నేస్తం పథకం కింద మరో 474 మంది పేద ఆర్య వైశ్యులకు ఏటా రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. ఎమ్మెల్యేగా గడప గడపకు తిరగటానికి తనకు సంవత్సరం 18 నెలలు పట్టిందని గుర్తు చేసుకున్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు వచ్చిన వాళ్లు ఇంటింటికీ ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ హయాంలో పట్టణంలో రెండు చోట్ల టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని చెబుతూ అధికారం కోల్పోయే నాటికి అవి అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. జగ్గడిగుంటపాలెంలో 75 శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను తాను పూర్తిచేసి అప్పటి లబ్ధిదారులకే అప్పగించినట్టు చెప్పారు. పూలే కాలనీలో టిడ్కో ఇళ్లు 60 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. సరిపడ నిధులు లేనందున వాటిని పూర్తి చేయలేకపోయినట్టు ఎమ్మెల్యే చెప్పారు. అయిదేళ్లలో ఏనాడూ టిడ్కో ఇళ్ల ముఖం చూడని ప్రతిపక్షాల అభ్యర్థులు, ఎన్నికల వేళ టిడ్కో ఇళ్లను సందర్శించి, విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉంటే ప్రజలు, వారి సమస్యలు పనికిరావా? అంటూ నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్ నుద్దేశించి ప్రశ్నించారు. రాష్ట్ర స్థాయి, ఢిల్లీ స్థాయి సమస్యలపై మినహా నియోజకవర్గ సమస్యలు పట్టవా? అని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకుడు అనేవాడు ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ప్రజల మధ్యలో ఉండాలనేది తన భావనగా చెబుతూ తన నడత, నడక అలాగే ఉంటుందని శివకుమార్ స్పష్టంగా చెప్పారు. ఎన్నికల ముందు నాలుగు మాయమాటలు ఎవరైనా చెబుతారని, ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాల్సింది ఓటర్లేనని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మీకుమారి, స్థానిక నాయకులు వుప్పల వరదరాజులు, దేసు శ్రీనివాసరావు, మద్దాళి శేషాచలం, బూర్లె నరసింహారావు, గొడవర్తి సాయిహరేరామ్, నంబూరి నరేంద్ర, అద్దంకి రామమోహనరావు, గుడివాడ ప్రసాద్, భాస్కరుని శ్రీనివాసరావు, అచ్యుత సాంబశివరావు, భాస్కరు ని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాయామంతో ఊపిరితిత్తులకు మేలు

డాక్టర్ యలమంచలి కావ్య



డాక్టర్ కావ్యకు సత్కారం

తెనాలి: యోగ, ప్రాణాయామంతో ఊపిరితిత్తుల వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని ప్రముఖ ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ యలమంచలి కావ్య సూచించారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం వాకర్స్ క్లబ్, తెనాలి సమావేశం నిర్వహించారు. 'వృద్ధులు–ఊపిరితిత్తులలో మార్పులు–శ్వాసకోశ వ్యాధులు–నివారణ' అంశంపై డాక్టర్ కావ్య ప్రత్యేక ప్రసంగం చేశారు. ఊపిరితిత్తుల పనితీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఊపిరితిత్తుల సమస్యలున్నవారు ఇన్‌హేలర్ వాడే విధానంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఇన్‌హేలర్ వాడకంతో వచ్చే సైడ్‌ఎఫెక్ట్స్ చాలా తక్కువగా చెప్పారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. యోగ, ప్రాణాయామం చేసే విధానాన్ని వివరించారు. క్లబ్ తరపున డాక్టర్ కావ్యను సత్కరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికారు. ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ తలశిల రాకేష్, మొవ్వా సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా 'స్వరలయ'ఉగాది వేడుకలు



ఇనయతుల్లా, ఫణీంద్ర, రామలింగేశ్వరరావుకు ఉగాది పురస్కారాల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు అధ్యక్షత వహించారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికీ సుఖ సంతోషాలను కలిగించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఎం.రామలింగేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి వేదాంతం ఫణీంద్ర, సామాజిక సేవకుడు షేక్ ఇనయతుల్లాకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, ఎల్ఐసీ ఉద్యోగుల జోనల్ జాయింట్ సెక్రటరీ జి.కిశోర్‌కుమార్ (మచిలీపట్నం), పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, రావిపాటి ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. తొలుత ఎం.సత్యవర్ధన్, కత్తి సౌజన్యచే సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ముత్తిరెట్టి శివాని మహిషాసుర మర్దిని నృత్యాంశం ఆకట్టుకుంది.

స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తిప్రదాతలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తమ జీవితం ద్వారా సమాజంలో స్ఫూర్తినింపిన 20 మంది మహోన్నత వ్యక్తుల గురించి ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాక్ హుస్సేన్ రచించిన స్ఫూర్తిప్రదాతలు పుస్తకం ఎందరికో స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ మంచా విజయరామ్మోహన్‌రావు, బీవీడీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రావి రంగారావు, డాక్టర్ మన్నవ సత్యనారాయణలు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, రేఖా కృష్ణార్జునరావు, మంచా విజయమోహనరావు, గోలి మధు, కంచర్ల కాశయ్య, సిందే బాలకృష్ణ, చిలకా వెంకటేశ్వరరావు, రేఖా నర్మద తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన



వాక్యోపదేశం చేస్తున్న బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి

ఫిరంగిపురం: కారుణ్య జపం, క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన జరుగుతుందని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పునరుత్థానం తరువాత వచ్చే ఆదివారం దివ్యభారతి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ సిలువపై ఉన్న క్రీస్తును సైనికులు బల్లెముతో పక్కలో పొడిచినప్పుడు శరీరం నుంచి రక్తం, నీరు వచ్చిందని, రక్తం నీరుతో భక్తుల పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు. ఆదేవిధంగా ఒక వైపు చీకటి, ఒక వైపు వెలుగు ఎలా ఉంటుందో ఆదేవిధంగా దివ్యకారుణ్యం అనేది నిండి ఉంటుందని చెప్పారు. క్రైస్తవ సంఘం విధులు నాలుగు ఉన్నాయన్నారు. అవి అపోస్తలుల బోధ, సహవాసం, రొట్టె విరవడం, సంఘముగా కుటుంబం ప్రార్థనలు చేయడం ద్వారా శక్తి ఏర్పడుతుందని తెలిపారు. దానిలో బలం, ధైర్యం నిండి ఉంటాయన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. ప్రార్థనలో ఫాదర్ విలియమ్స్, సహాయ విచారణ గురువు అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

పోలకంపాడులో పంట పొలాల్లో అగ్నిప్రమాదం

- భారీఎత్తున ఎగిసిపడిన మంటలు
- సకాలంలో స్పందించి ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పోలకంపాడులో పాత జాతీయ రహదారికి, గుంటూరు చానల్‌కు, ఉండవల్లి ఎస్సీ కాలనీ కరకట్టకు మధ్యలో ఉన్న పంటపొలాల్లో పంట వ్యర్థాలకు ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దాదాపుగా 10 ఎకరాల్లో కోసిన వరికంకుల మోళ్లు ఉండడం, చెత్తా చెదారం ఉండడంతో చుట్టుపక్కల ఉన్న ముళ్ల పొదలకు మంటలు వ్యాపించాయి. ఆ మంటలు ఉండవల్లి ఎస్సీకాలనీ కరకట్ట వెంబడి దేవాలయ భూముల్లో ఉన్న నివాసాలవైపు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని, సుమారు 4 ఎకరాల పొలంలో వ్యాపించిన మంటలను అదుపు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీఎత్తున మంటలతో పాటు పొగ కూడా వ్యాపించడంతో స్థానికులు పొగకు, ఎండ తీవ్రకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

10న కళాదర్బార్ ఉగాది పురస్కారాలు

పాత గుంటూరు: శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని శ్రేష్ఠ హాస్పిటల్ సౌజన్యంతో ఈ నెల 10న వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై 10న సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, సినీ సంగీత విభావరిలు ఉంటాయని తెలిపారు. అనంతరం సినీ నటి శ్రీమణి, ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, డాక్టర్ షమ సుల్తానా, గాయని పి సుజాత, సాహితీవేత్త పచ్చిపులుసు సూర్యనారాయణ, నృత్య కళాకారిణి మహంకాళి నాగలక్ష్మిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కుమార్, శేఖర్, బాబూరావు, బి. రాజశేఖర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పేదలకు అత్యాధునిక వైద్యం

- సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్
- ఘనంగా వరల్డ్ హెల్త్ డే వేడుకలు



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్. వేదికపై సీనియర్ సివిల్ జడ్జి లీలావతి తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం శుశ్రుత హాలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది నా ఆరోగ్యం..నా హక్కు నినాదాన్ని తీసుకుందన్నారు. దీన్ని ముగ్గురికి చేరవేయాలని వారు మరో ముగ్గురికి సమాచారం అందించాలని సూచించారు. సాంఘిక దురాచారాలు, మంత్రాలు, తంత్రాలు వంటివి పని చేయవన్నారు. మనిషిని బతికించేది సైన్స్ అనే విషయాన్నీ ప్రతి ఒక్కరు గమనించాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి టి. లీలావతి మాట్లాడుతూ ఆరోగ్యం గురించి ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోగుల్లో ఆత్మవిశ్వాసం పెరిగే విధంగా వైద్య సిబ్బంది పని చేయాలని చెప్పారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్ మాట్లాడుతూ రోగులకు సహృదయంతో నర్సులు వైద్య సేవలు అందించాలని సూచించారు. వరల్డ్ హెల్త్ డేపై ప్రజలకు అవగాహన కోసం ముందుగా నర్సింగ్ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ నుంచి ఏసీ కళాశాల, నాజ్ సెంటర్ మీదుగా తిరిగి జీజీహెచ్‌కు చేరుకుంది కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, అడ్మినిస్ట్రేటర్ బి. ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఫిరంగిపురం: అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేని వ్యక్తి పురుగుమందు తాగి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామానికి చెందిన కె.రాంబాబు గతంలో గొర్రెలు పెంచుకునేవాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులకు వెళుతున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం కారణంగా మతిస్థిమితం లేదు. దీంతో శుక్రవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మరునాడు గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం పక్కనే పురుగుమందు డబ్బా పడిఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరనారాయణ తెలిపారు.

'కాయితాల రుజువు' కథల సంపుటి ఆవిష్కరణ

పాత గుంటూరు: నమ్మిన సిద్ధాంతాల కోసం రచనలు చేస్తున్న ప్రముఖ రచయిత్రి నల్లూరి రుక్మిణి అభినందనీయులని అరుణతార పత్రిక వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ సమావేశ మందిరంలో నల్లూరి రుక్మిణి రచించిన ' కాయితాల రుజువు' కథా సంపుటిని వరలక్ష్మి ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో ఫైనాన్స్ పెట్టుబడిదారులు చేస్తున్న విధ్వంసాన్ని, సంక్షోభాన్ని, కుటుంబ జీవితాల్లోని మనుషుల వ్యక్తిత్వాలను, వెతలను కథల సంపుటిలో కళ్లకు కట్టినట్లు చూపారని తెలిపారు. ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ సమకాలిన సమస్యలకు శ్వేత పత్రం లాంటిది కాయితాల రుజువు పుస్తకం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రచయిత్రి రుక్మిణి 'కాయితాల రుజువు' కథల సంపుటి ఆలోచనలను రేకెత్తిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, విరసం సి.ఎస్.ఆర్. ప్రసాద్, కాపు శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పలువురు రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

కొల్లిపర: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చిన్న కుమారుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ ఓటర్లను కోరారు. ఆదివారం కొల్లిపర గ్రామంలో నాలుగో రోజు రైస్ మిల్ వద్ద నుంచి ఇంటింటి ఎన్నికల ప్రచారం లో భాగంగా ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి , సీనియర్ నాయకులు అవుతు కృష్ణారెడ్డి, స్థానిక పార్టీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ఐదేళ్లలో కొల్లిపర పంచాయతీ పరిధిలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బట్టిప్రోలు వెంకటలక్ష్మి , ఎంపీటీసీ కె.శ్రీలత, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి , కళ్ళం వీరారెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు, వార్డు మెంబర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలిరూరల్: పేకాట ఆడుతున్న జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. తెనాలిలోని మార్కెట్ వద్ద తూర్పు కాల్వలో నీరు లేకపోవడంతో వంతెన కింద ఆదివారం ఎనిమిది మంది పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని రూ. 8,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ మారీసుపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి ఆదివారం 10 క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ



ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఈద్గా గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ గడిచిన రెండువారాలుగా ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీలు ఆదివారం ముగిసినట్లు తెలిపారు. ఫైనల్ పోటీల్లో యాంగ్రీ టైగర్స్ టీంపై రాయల్ ఫైటర్స్ టీం క్రీడాకారులు గెలుపొందారు. వారికి మాజీ సర్పంచ్ నాగుల్ మీరా షరీఫ్ రూ.10,116లు బహుమతి నగదు అందజేశారు. రన్నరప్ టీం సభ్యులకు రూ.5,116 నగదును సొసైటీ చైర్మన్ షేక్ ఖాజావలి అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా పెదజానీ, బెస్ట్ బౌలర్‌గా రాణాలకు ఒక్కొక్కరికి రూ.1500 నగదును షేక్ ఇమాం ఖాజావలి అందజేశారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన చంద్రిక



మంగళగిరి: ఈనెల 8వ తేదీ నుంచి 1 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న సీనియర్ నేషనల్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు రాష్ట్రం తరపున మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ బొల్లినేని చంద్రిక ఎంపికయినట్లు కోచ్ షేక్ సంధాని తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో చంద్రికను గుంటూరు జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ చంద్రిక 84 కేజీల విభాగంలో పోటీలలో పాల్గొంటారని తెలిపారు. చంద్రిక పోటీలలో ప్రతిభ కనబరచి పతకాలు సాధించాలని కోరుతూ అభినందించిన వారిలో అసోషియేషన్ ప్రతినిధులు కొమ్మాకుల విజయభాస్కరావు, షేక్ సంధాని, మద్ది ప్రభాకర్, సకల సూర్యనారాయణ, సకల కోటేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

కరాటే గ్రేడింగ్ పరీక్షలు



మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనారాయణ స్వామి గుడి ఎదుటఉన్న కరాటే స్కూలులో కరాటే గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన పోటీలలో ఎంఎంకే స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు, పెదవడ్లపూడికి చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కరాటే శిక్షకులు నరసయ్య, గణేష్, జీకే శేఖర్, డి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.